ఈనాడు
మెదక్
శనివారం అక్టోబరు 12, 2024

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం: కలెక్టర్

పాపన్నపేట: ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణనే ధ్యేయంగా సేవలందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం పొడ్చన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో ఓపికగా మాట్లాడాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. వైద్యురాలు అపర్ణ, సిబ్బంది అలీ, హాజీ తదితరులున్నారు.

న్యాయ సేవలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటా లాల్‌చంద్

మెదక్ అర్బన్: న్యాయ సేవలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటా లాల్‌చంద్ అన్నారు. శుక్రవారం మానసిక ఆరోగ్య దినం పురస్కరించుకొని మెదక్‌లోని ప్రభుత్వ మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ... పిల్లల మానసిక స్థితి, ఒత్తిడి, ఎదుగుదల, గర్భిణీ మహిళల పోషకాహారం, చిన్న పిల్లలపై లైంగిక నేరాలు, సెల్‌ఫోన్లు అతిగా వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిద్ధాగౌడ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిద్ధిరాములు, వైద్యులు శివదయాల్, ప్రీతి, నిఖిల తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పాపన్నపేట, న్యూస్‌టుడే: వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలందించాలని డీఎంహెచ్‌వో శ్రీరాం అన్నారు. శుక్రవారం పాపన్నపేట ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ... ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే చాలా వ్యాధులు అరికట్టవచ్చని తెలిపారు. శీతాకాలం సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉందని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యుడు హరిప్రసాద్, సీహెచ్‌వో చందర్, సిబ్బంది తదితరులున్నారు.



విజయదశమి శుభాకాంక్షల ప్రత్యేక అనుబంధం నేటి సంచికతో ఉచితంగా అందుకోగలరు.

పల్లెల్లో 491.. పట్టణాల్లో 75

జిల్లాలో ఏర్పాటుకానున్న ఇందిరమ్మ కమిటీలు • నేటి నుంచి గ్రామసభలు

న్యూస్‌టుడే, మెదక్

దసరా సందర్భంగా ప్రభుత్వం మరో తీపి కబురు వినిపించింది. ఎన్నికల హామీ నెరవేర్చేందుకు రంగం సిద్ధమైంది. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు అడుగులు వేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లు కేటాయించనున్న విషయం విదితమే. ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లించనుంది. ఇందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఊరూరా ఇందిరమ్మ కమిటీలు నియమించి సదరు కార్యక్రమం చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. ఆయా కమిటీలు, అధికారులే లబ్ధిదారులను గుర్తిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నేటి నుంచి ఇందిరమ్మ కమిటీల నియామకానికి ఊరూరా గ్రామసభలు నిర్వహించనున్నారు.

తొలిదశలో 9000 మందికి లబ్ధి

జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. దుబ్బాక నియోజకవర్గం



లోని చేగుంట, నార్సింగి, గజ్వేల్ పరిధి తూప్రాన్, మనోహరాబాద్, అందోల్ పరిధి టేక్మాల్, రేగోడ్, అల్లాదుర్గం, నారాయణఖేడ్ పరిధి పెద్దశంకరంపేట మండలాలు వస్తాయి. తొలి విడతలో భాగంగా ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున.. జిల్లాకు 9000 ఇళ్లు మంజూరు చేయనున్నారు. జిల్లాలోని 491, పంచాయతీలు, 4 మున్సిపాలిటీల్లోని 75 వార్డుల్లో కమిటీల నియామకానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వీరికి చోటు..

పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచుల స్థానంలో ప్రత్యేకాధికారికి ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పించారు. ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ఒకరు, పంచాయతీ కార్యదర్శి కమిటీలో భాగస్వాములు.

- మున్సిపాలిటీల పరిధిలో ఓ వార్డు కౌన్సిలర్, ఇద్దరు మహిళా పొదుపు సంఘాల సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు, వార్డు అధికారి కమిటీల్లో సభ్యులుగా ఉంటారు. వీరు గ్రామ సభల్లో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఎవరైనా అనర్హులు ఎంపికై బిల్లులు తీసుకుంటే.. వారిపై ఫిర్యాదు చేసి.. నిధులు రికవరీ చేసే అధికారం వీరికి ఉంటుంది. ఇందిరమ్మ కమిటీల జాబితాను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాల్సి ఉంటుంది.

నిబంధనలు ఇలా..
- పేద, మధ్య తరగతి వారై ఉండాలి.
- జాతీయ ఆహార భద్రత కార్డు కలిగి ఉండటం తప్పనిసరి.
- అద్దె ఇళ్లలో నివాసముంటున్న వారికి ప్రాధాన్యం.
- ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం
- సొంత ఇంటి జాగా కలిగి ఉండాలి.

చెక్కుల పంపిణీ రసాభాస

• కాంగ్రెస్, భారాస నాయకుల పోటాపోటీ నినాదాలు


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి: వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను సక్రమంగా అమలు చేయడంలేదని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు ఆగ్రహంతో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిగా భారాస నాయకులు సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు ఇరువర్గాలను కార్యాలయం బయటికి పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి చెక్కులు వచ్చి నెలకు పైగా అయినా.. మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు ఆలస్యం చేశారని.. తాను అధికారులపై ఒత్తిడి తెచ్చి పంపిణీ చేస్తున్నానని వివరించారు. అనంతరం వెల్దుర్తి, మాసాయిపేట తహసీల్దార్లు కృష్ణ, జ్ఞానజ్యోతిలతో కలిసి 79 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం


కార్యాలయంలోకి వెళ్లకుండా ఇరు పార్టీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ఎమ్మెల్యే సునీతారెడ్డి భారాస నాయకులు చంద్రాగౌడ్, భూపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రైతు భరోసా, రుణమాఫీ, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ, మహాలక్ష్మి అమలు అవకతవకలపై నిలదీశారు. పోటీగా కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సుధాకర్‌గౌడ్, తలారి మల్లేశం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.


రామాయంపేట మండలం కల్వకుంటలో ఏర్పాటు చేసిన కుంకుమార్చనలో మహిళలు, అమ్మవారికి సమర్పించిన పలు రకాల నైవేద్యాలు

వనదుర్గను దర్శించుకున్న ప్రముఖులు


దుర్గమ్మ సేవలో కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

పాపన్నపేట, న్యూస్‌టుడే: వనదుర్గామాతను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద వారి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తదుపరి అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదల ప్రకారం సిబ్బంది సత్కరించారు.


పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు

- వనదుర్గామాతను రాష్ట్ర పాఠశాల విద్యా పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన వెంట పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి ఉన్నారు.

ఆర్ఆర్ఆర్ భూముల మార్కెట్ విలువ పెంపు!

నర్సాపూర్, న్యూస్‌టుడే: ప్రాంతీయ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణంలో రైతులు కోల్పోతున్న భూముల మార్కెట్ విలువను పెంచారు. గతంలో ఇక్కడి ఎకరం భూమి మార్కెట్ విలువ రూ.4,50,000లు ఉండగా, ప్రస్తుతం రూ.13.50 లక్షలకు పెరిగింది. దీనికి మూడింతల పరిహారం రైతులు పొందే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ విలువ రూ.1350గా కనిపిస్తోందని అన్నారు. పరిహారం చెల్లింపు విషయం ఇంకా ఖరారు కాలేదని తెలిపారు. అయితే ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో కోల్పోతున్న భూములకు మాత్రమే ఈ మార్కెట్ విలువ వర్తిస్తుందని అన్నారు. మిగతా వాటికి వర్తించదని పేర్కొన్నారు. గతంలో కంటే మెరుగైన పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం, అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సిద్ధిధాత్రి దేవిగా వనదుర్గమ్మ



పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శుక్రవారం మహర్నవమి సందర్భంగా మెరూన్ రంగు వస్త్రాలంకరణలో సిద్ధిధాత్రి దేవి(సర్వ నారాయణి)గా అమ్మను అలంకరించారు. అర్చకులు తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. వరద తగ్గడంతో భక్తులను దర్శనాలకు గర్భాలయంలోకి అనుమతించారు.

అసుర సంహారం.. సరస్వతీదేవి రూపం



వర్గల్: సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యా సరస్వతి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయంలో సుగంధద్రవ్యాలతో నింపిన 108 కలశాల పూజలు చేశారు. అమ్మవారిని భాజపా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ దంపతులు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి దంపతులు దర్శించుకొని అర్చించారు.



కౌమారం.. దేవీ రూపం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో బాలకుమారిక పూజను శుక్రవారం నిర్వహించారు. చిన్నారులను దేవీ రూపాలుగా అలంకరించారు. బాలికలు అమ్మవారితో సమానమని, వైద్యశాలిగా పెంచాలని నిర్వాహకులు బీకే భవాని అన్నారు. సంస్థ ప్రతినిధులు స్వప్న, ప్రమతి, సభ్యులు ఉన్నారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట

సంకల్ప దీక్ష.. విజయ కాంక్ష

సిద్దిపేట ■ మెదక్ ■ సంగారెడ్డి ■ వికారాబాద్ ■



న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి అర్బన్, జహీరాబాద్, వికారాబాద్ కలెక్టరేట్

చెడుపై మంచి.. నిరాశపై ఉత్సాహం.. అనారోగ్యంపై ఆరోగ్యం.. వేధింపులపై చైతన్యం.. ఇలా సమాజ హితాన్ని కోరే ప్రతీది విజయం సాధించాల్సిన సందర్భమిది. విజయానికి ప్రతీకగా నిలిచే దసరా.. ఆశావహ దృక్పథంతో అడుగేయాల్సిన ఆవశ్యకతను చెబుతోంది. దుర్గాదేవి.. మహిషాసురుడి ని తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి అంత మొందించిన సందర్భంగా విజయ దశమిని అత్యంత వైభవంగా నిర్వహించుకుంటున్న వేళ మార్పు తీసుకురావాల్సిన అంశాలపై ప్రత్యేక కథనం.

కొలువుపై యువగురి



యువత (లక్షల్లో..)	
సిద్దిపేట	4.50
మెదక్	2.50
సంగారెడ్డి	7.00
వికారాబాద్	3.80

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో జనాబాలో సింహభాగం యువతదే. లక్ష్య సాధనే ధ్యేయంగా దీక్షతో శ్రమిస్తున్నారు. తాజా డీఎస్సీలో విడుదలైన ఫలితాలే ఇందుకు నిదర్శనం. భవానీమాత స్ఫూర్తితో ఎంతోమంది విజయాలు అందుకున్నారు.

అంధుడైనా గెలిచి..



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన బూర్దిపాడ్ ప్రవీణ్‌కు పుట్టుకతో అంధుడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో డీఎడ్ పూర్తిచేశారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విని, ఇంట్లో కుటుంబీకుల ద్వారా చదివించుకున్నారు. ఇతరుల సాయంతో డీఎస్సీ రాసి ఫలితం అందుకున్నారు. నిరాశలో కూరుకుపోతున్న వారికి ఇతడే ఆదర్శం.



ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో శమీవృక్షానికి పూజలు సహా పాలపిట్ట దర్శనానికి పల్లెలు, పట్టణాల్లో ప్రజలు బారులు తీరుతారు. యువత ఆటాపాటలతో సందడి చేస్తారు. నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జగన్మాతను కొలిచే భక్తులు తన్మయత్వానికి లోనవుతుంటారు. నిమజ్జనం సమీపించడంతో మండపాల్లో విశేష పూజలు ప్రత్యేకతను చాటుతాయి.

ఆరోగ్య దీక్ష

మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు, జన్యుపరమైన సమస్యలు, కాలుష్యం, ఇతర కారణాలతో ఎంతోమంది బాధపడుతున్నారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో ప్రతి ఒక్కరూ జీవనశైలిని మార్చుకోవాలని చెబుతోంది భవానీమాత. పలువురు భక్తులు నవరాత్రులు అమ్మ దీక్ష తీసుకున్నారు. ఈ స్ఫూర్తితో ఆరోగ్య రక్షణకు దీక్షబూనాల్సి ఉంది. రోజులో కనీసం గంట వ్యాయామం, యోగా, ఆటలపై దృష్టి సారించాలి. మైదానం బాటపడితే మార్పునకు అడుగేసినట్లే.



శక్తి స్వరూపిణి..

ఆడపిల్లలు, మహిళలు శక్తి స్వరూపిణితో సమానం. అన్ని రంగాల్లో తమదైన సత్తా చాటుతున్నారు. గృహిణి, ఉద్యోగిని, వ్యాపార, వాణిజ్యం, రాజకీయం, సాంకేతికం.. ప్రతి అంశంలో అగ్రభాగాన నిలుస్తున్నారు. మరోవైపు మాత్రం ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. అఘాయిత్యాలు, వేధింపులు పెరుగుతున్నాయి. ఇందులో మార్పు రావాల్సిన ఆవశ్యకత ఉంది. శక్తిస్వరూపిణి కళ్లు తెరిచే వరకు చూడొద్దు మరి.

మహిళలు (లక్షల్లో..)	
సిద్దిపేట	4.50
మెదక్	1.90
సంగారెడ్డి	7.50
వికారాబాద్	3.50

బ్లడ్ క్యాన్సర్‌ను జయించి..

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన సుజాతకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త ఓ ప్రైవేటు కంపెనీలో ఒప్పంద ఉద్యోగి. కొంతకాలం కిందట బ్లడ్ క్యాన్సర్ బారిన పడ్డారు. భర్త సహకారంతో మనోధైర్యంతో ఎదుర్కొన్నారు. అమ్మవారి స్ఫూర్తితో కుమిలిపోలేదు. చివరకు చికిత్స పొంది క్యాన్సర్‌ను జయించారు. ప్రస్తుతం కుటుంబీకులతో సంతోషంగా ఉంటున్నారు.



ప్రకృతి ఆరాధన

అడవులు (హెక్టార్లలో..)	
సిద్దిపేట	26,041
మెదక్	57,000
సంగారెడ్డి	20,662
వికారాబాద్	43,200


బతుకమ్మ, దసరా.. ప్రకృతితో మమేకం కావాలని చెబుతున్నాయి. అలాంటి ప్రకృతి సంరక్షణకు అందరూ ప్రతినబూనాలని దుర్గమ్మ సూచన. అడవుల శాతం తగ్గిపోతుండటంతో పర్యావరణ రక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఏటా ప్రతి ఒక్కరూ కనీసం పది మొక్కలు నాటితే వాతావరణం, వాయు, జల, కాలుష్యానికి అడ్డుకట్ట పడినట్లే. గ్రామాల్లోకి వస్తున్న జంతు జాతులు జనాలను వీడి తిరిగి వనాల బాట పడుతాయి.



పిల్లలే స్ఫూర్తి..

మెదక్ జిల్లా చేగుంట మండలం కరీంనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఒకప్పుడు కళావిహీనంగా ఉండేది. ఉపాధ్యాయులు, విద్యార్థులు చొరవ చూపి ఒక్కో కుండీ మొక్కలు నాటి సంరక్షించడంతో ఇప్పుడు పచ్చదనం స్వాగతం పలుకుతోంది. వీరి స్ఫూర్తిగా అందరూ కదిలితే అమ్మ సంతోషించినట్లే.

శమీ వృక్షానికి పూజలు



ద్వాపర యుగంలో పాండవులు అజ్ఞాతవాస ఆరంభంలో తమ ఆయుధాలను ఒక జమ్మిచెట్టు (శమీవృక్షం) కొమ్మపై భద్రపర్చారని మహాభారతం చెబుతోంది. ధర్మరక్షకు విజయానికి దివ్యమైన ఆయుధాలను శమీవృక్షం రక్షించింది. అందుకే జమ్మి చెట్టుకు పూజలు చేస్తుంటారని ప్రతీతి.

మస్కట్‌లో బతుకమ్మ సందడి



కొడంగల్, న్యూస్‌టుడే: తెలంగాణవారు ఎక్కడ ఉన్నా మన సంప్రదాయాలు మరిచిపోరు అనేందుకు బతుకమ్మ పండుగనే ఉదాహరణ. శుక్రవారం ఒమన్ దేశంలోని మస్కట్‌లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, రాధ, తేజస, సంధ్య, రాధికలతో పాటు ఆవుల సత్యకుమార్, గణేష్, గుండేటి, కుమార్, రవి, రమేష్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు గద్దర్ పేరు

న్యూస్‌టుడే, తూప్రాన్: తూప్రాన్ మండలం కిష్టాపూర్ సమీపంలో హల్దీ వద్ద పెద్ద చెరువులోకి పంపింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన ఎత్తిపోతలకు 'గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ పంపు హౌస్'గా నామకరణం చేశారు. గతంలో 30 ఏళ్ల పాటు పెద్ద చెరువు నిండకపోవడంతో ప్రజా గాయకుడు గద్దర్ ప్రత్యేక చొరవ తీసుకొని రూ.3.61 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయించారు. ఇటీవల తూప్రాన్ మున్సిపాలిటీలో గద్దర్ పేరు పెట్టాలని తీర్మానం చేయడంతో శుక్రవారం ఆ పనులు నిర్వహించారు. ఎత్తిపోతలకు గద్దర్ నామకరణం చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

గవ్వలపల్లి వాసికి అత్యుత్తమ పదవి



సంతోష్‌రావు

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లికి చెందిన ఏకే.సంతోష్‌రావు ఆస్ట్రేలియా-భారత వాణిజ్య విభాగం సలహా మండలి సభ్యునిగా నియమితులయ్యారు. ఆస్ట్రేలియా-ఇండియా ట్రేడ్ అసోసియేషన్ ఛైర్మన్ ఆశిశ్ మిశ్రా నియామకపత్రం అందించినట్లు శుక్రవారం ఆయన 'న్యూస్‌టుడే'కు తెలిపారు. భారతదేశానికి చెందిన తనకు ప్రత్యేక గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. ఆస్ట్రేలియాలో స్థిరపడిన ఆయనను తల్లి తాజా మాజీ సర్పంచి మంగాదేవి, ఏకే.యాదవరావులు, గ్రామస్థులు అభినందించారు.

జహీరాబాద్ మీదుగా జాల్నా- తిరుపతి ప్రత్యేక రైలు

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్: దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని జహీరాబాద్ స్టేషన్ మీదుగా జాల్నా- తిరుపతి (07621 జెటీఆర్‌టీపై/07622 టీఆర్‌టీపై జె) ప్రత్యేక రైలు అందుబాటులోకి వచ్చినట్లు స్థానిక స్టేషన్ మేనేజర్ మాధవకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13, 20, 27 తేదీలతోపాటు నవంబరు 3వ తేదీల్లో జాల్నా నుంచి తిరుపతికి రైలు ఉంటుందన్నారు. జహీరాబాద్ పట్టణానికి ఆయా తేదీల్లో తెల్లవారుజామున 4:28/4:30 గంటలకు చేరుకుంటుందని అన్నారు. తిరుపతి నుంచి జాల్నాకు తిరుగు ప్రయాణం ఈనెల 14, 21, 28తో పాటు నవంబరు 4వ తేదీన జహీరాబాద్‌లో ఉదయం 8:30/8:31 నిమిషాలకు ఉంటుందని పేర్కొన్నారు.

గరుడ వాహనంపై అనంత పద్మనాభుడు



వికారాబాద్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం వికారాబాద్ పరిధి ఆలంపల్లిలో దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పెరుగు బసంతం సందర్భంగా శ్రీ అనంతపద్మనాభ స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి స్వామివారి సేవలో పాల్గొని పల్లకి మోశారు. స్వామివారిని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సాయంత్రం స్వామివారి హంసవాహన సేవ నిర్వహించారు.

పదం.. కదం.. జనజాగృతం

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో 'నమస్తే సదావత్సలే మాతృభూమే' అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కార్యకర్తల నినాదాలు మారుమోగాయి. సిద్దిపేటలో ఆర్‌ఎస్‌ఎస్ కవాతు (పద సంచాలన్) నిర్వహించి విజయదశమి ఉత్సవ ప్రదర్శన చేపట్టింది. అనంతరం జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రాంత సేవా ప్రముఖ్ గాజుల శివశంకర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో జాతీయత, వ్యక్తిగత శీలం పెంపొందాలన్నారు. ప్రస్తుతం హిందుత్వాన్ని దెబ్బతీసేందుకు హిందూవ్యతిరేక శక్తులు కుట్రలు చేస్తున్నాయని, జాగ్రత్తగా ఉంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్



సిద్దిపేటలో పద సంచాలన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

నకిలీ బంగారంతో బురిడీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: నకిలీ బంగారంతో గుర్తుతెలియని ఇద్దరు.. దంపతులను బురిడీ కొట్టించి రూ.3 లక్షలతో ఉడాయించిన ఘటన సిద్దిపేటలో ఆలస్యంగా వెలుగుచూసింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. రేణుకానగర్‌కు చెందిన ఉడుత రమేశ్, రేణుక దంపతులు అదే కాలనీలో లేడీస్ ఎంపోరియం నడుపుతున్నారు. ఈనెల 5న గుర్తు తెలియని ఆడ, మగ ఇద్దరు వ్యక్తులు వచ్చి అన్నాచెల్లెళ్లమని నమ్మబలికారు. రేణుకతో పరిచయం పెంచుకొని తమ వద్ద కొంత బంగారం ఉందని చెప్పి చిన్న ముక్క ఇచ్చారు. వారు వెళ్లాక పరీక్షిస్తే అసలైన బంగారమని తేలింది. మరుసటి రోజు దుండగులు వచ్చి ఆ ముక్కను తీసుకెళ్లారు. గురువారం సిద్దిపేటకు వచ్చి తాము వేములవాడ కమాన్ వద్ద ఉన్నామని 25 తులాల బంగారు బిస్కెట్ ఉందని. . రూ.3 లక్షలకు ఇస్తామని చెప్పడంతో రేణుక దంపతులు నమ్మారు. రమేశ్ అక్కడికి వెళ్లి సొమ్ము ఇచ్చి దుండగులు ఇచ్చిన బిస్కెట్ తెచ్చారు. దాన్ని పరిశీలించగా నకిలీదని తేలింది. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓట్ల రాజకీయాలకే లౌకికవాదం: లక్ష్మణ్



రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ దంపతులకు ప్రసాదం, చీర అందిస్తున్న అర్చకులు

వర్గల్, న్యూస్‌టుడే: దేశంలో ఓట్ల రాజకీయాల కోసం లౌకికవాదం పేరిట కొందరు సనాతన ధర్మాన్ని విమర్శించడం పరిపాటిగా మారిందని భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యాధరి క్షేత్రాన్ని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నత శిఖరాలకు చేర్చారన్నారు. గతానికి భిన్నంగా ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరువలో ఉన్నట్లు స్పష్టం చేశారు. హిందూ సమాజం జాగృతమై లౌకికవాదుల చర్యలను అడ్డుకోవడానికి మరింత చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక, యాంత్రిక జీవనానికి లోనై ఒత్తిడికి తట్టుకోలేక ధర్మం వైపు యువత ఆకర్షితులు కావడం శుభ పరిణామమని పేర్కొన్నారు. జిల్లా భాజపా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై కేసు

పటాన్‌చెరు అర్బన్: యువతిని వేధిస్తున్న యువకుడిపై పటాన్‌చెరు ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలానికి చెందిన యువతి ఏఎన్‌ఎంగా పని చేస్తోంది. ఆరు నెలల క్రితం ఆటో డ్రైవర్ నేనావత్‌రెడ్డితో పరిచయమైంది. ప్రేమిస్తున్నానని చెప్పి బయటకు తీసుకెళ్లి ఆమెతో కొన్ని ఫొటోలు దిగాడు. తర్వాత అతడి ప్రవర్తన నచ్చక రెండు నెలలుగా మాట్లాడటం లేదు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి తనతో మాట్లాడాలని లేకుంటే ఫొటోలు బయట పెడతానని బెదిరించాడు. ఈనెల 10న బీరంగూడ, పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రుల వద్ద యువతిపై దాడిచేయడంతో పాటు చరవాణి గుంజుకొని నేలకేసి కొట్టాడు. శుక్రవారం, ఆమె ఉంటున్న వసతి గృహం వద్దకు వచ్చి బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: ఆలయాలే లక్ష్యంగా వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను శుక్రవారం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఎస్సై నారాయణగౌడ్ తన సిబ్బందితో కలిసి మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో వాహన తనిఖీలు చేస్తున్నారు. కారులో అనుమానాస్పదంగా వెళుతున్న ముగ్గురిని గుర్తించి ఆపేందుకు యత్నించగా.. పరారయ్యారు. ఎస్సై సిబ్బందితో వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా డిక్కీలో ఇనుప రాడ్డు, ఆలయాల్లో చోరీ చేసిన ఆభరణాలను గుర్తించారు. విచారించగా.. నిందితులు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన అస్లాంఖాన్, షేక్ ఇలియాస్, షేక్ సమీర్‌లుగా గుర్తించారు. గత నెలలో కామారెడ్డి జిల్లా గోపాల్‌పేట గ్రామంలోని రామాలయం, మెదక్ జిల్లా హవేలిఘన్‌పూర్ మండలం పోచమ్మరాల్ తండాలో ఇంట్లో బంగారం, వెండి వస్తువులు, చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లిలోని దుర్గామాత ఆలయంలో కిరీటం, శఠగోపం, ఇత్తడి వస్తువులు, చేగుంట మండలం చందాయిపేటలోని హనుమాన్ ఆలయంలో వెండి, ఇత్తడి వస్తువులు ఎత్తుకెళ్లారు. చేర్యాలలోని గిఫ్ట్ ఆర్టికల్ దుకాణంలో రూ.60వేల నగదు దొంగిలించినట్లు పోలీసుల విచారణలో తెలిపారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను హైదరాబాద్‌కు తీసుకెళ్లి విక్రయించాలని చూశారు. మార్గమధ్యలో గుడి, తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడడానికి వెళుతుండగా పోలీసులకు దొరికిపోయారు. వీరి నుంచి 51గ్రాముల బంగారు, 1.8కిలోల వెండి ఆభరణాలు, నగదు రూ.13,700, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. దొంగల ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై నారాయణగౌడ్, కానిస్టేబుళ్లు రాజశేఖర్, భాస్కర్‌లను ఎస్పీ అభినందించి నగదు పురస్కారాన్ని అందించారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్‌లు పాల్గొన్నారు.

ఆస్తిలో వాటా కోసమే.. శిశువు అపహరణ

- సంగారెడ్డి డీఎస్పీ వెల్లడి
- నలుగురు మహిళల అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్, సీఐ భాస్కర్, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా ఆసుపత్రిలో శిశువును అపహరించిన కేసులో పోలీసులు నలుగురు మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు.. సంగారెడ్డిలోని నాల్‌సాబ్‌గడ్డకు చెందిన రుక్సానాబేగం 16 ఏళ్ల క్రితం దస్తగిరిని వివాహమాడింది. వీరికి ఇద్దరు మగ పిల్లలున్నారు. కొన్ని రోజుల క్రితం దస్తగిరి మరణించారు. ఆమె ఇక్కడి నుంచి హైదరాబాద్‌లోని బోరబండకు వెళ్లారు. హైదరాబాద్‌లోని బార్కస్(పాత పట్టణం)కు చెందిన మహ్మద్ సమీర్‌ను వివాహమాడింది. పిల్లలు పుట్టే అవకాశం లేదని, తన భర్త ఆస్తిలో వాటా దక్కదేమోనని ఆందోళన చెందింది. పసి పిల్లలను ఎవరైనా విక్రయిస్తారా.. అని ఆరా తీసింది. ఆ ప్రయత్నం ఫలించలేదు.

చాకచక్యంగా ఎత్తుకెళ్లారు

ఈ నెల 9న రుక్సానాబేగం, తల్లి సయిదాబేగం, వరుసకి చెల్లెళ్లు ముస్కాన్‌బేగం, జువేరియా ఫాతిమాలు కలిసి సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. దవాఖానా వెనుక తలుపు నుంచి వచ్చి బురకాలు ధరించారు. కారిడార్‌లో శిశువును పడుకోబెట్టిన విషయాన్ని గమనించారు. ఆ పాపను సయిదాబేగం అపహరించగా... స్కూటీపై సంగారెడ్డి పట్టణంలోకి.. అక్కడి నుంచి ఆటోలో హైదరాబాద్‌లోని బోరబండకు వెళ్లారు. శిశువు అపహరణపై బాధిత కుటుంబీకులు, ఆసుపత్రి పర్యవేక్షకులు పట్టణ సీఐ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమై పది బృందాలను నియమించారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా తనిఖీలు చేశారు. నిందితులు బోరబండకు వెళ్లినట్లు గుర్తించారు. బోరబండలో సయిదాబేగం, ముస్కాన్, జువేరియా ఫాతిమాలను గురువారం అరెస్టు చేశారు. అపహరణకు గురైన శిశువును తల్లిచెంతకు చేర్చారు. శుక్రవారం రుక్సానాబేగంను పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, సదాశివపేట సీఐ మహేశ్‌గౌడ్, పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్, ఎస్ఐలు విజయ్‌గౌడ్, వినయ్, హరిశంకర్‌గౌడ్, సీసీఎస్, ఐటీ విభాగం సిబ్బందిని ఎస్పీ రూపేష్ అభినందించారు.

ఆలయాల్లో చోరీలు చేస్తున్న ముఠా పట్టివేత?

పాపన్నపేట, న్యూస్‌టుడే: ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఆగస్టు 9న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి రెండు హుండీలను ఎత్తుకెళ్లి వాటిలో నుంచి కానుకలు, నగదు దొంగిలించిన విషయం తెలిసిందే. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ఆలయాల్లో చోరీలు జరిగాయి. అక్కడి పోలీసులు ఓ ముఠాను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు అక్కడి ఆలయాలతో పాటు ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో హుండీల చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. మండలంలోని మిన్పూర్‌కు చెందిన ఓ యువకుడు వీరితో ములాఖత్ అయ్యాడు. అతనే వారిని ఇక్కడికి తీసుకొచ్చి చోరీ చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు సమాచారం. స్థానిక ఎస్సై శ్రీనివాస్ గౌడ్‌ను వివరణ కోరగా... నిందితులు దొరికిన విషయం వాస్తవమేనని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఆలయ వార్షికోత్సవానికి ఎంపీకి ఆహ్వానం



ఎంపీ రఘునందన్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చందాయిపేట వాసులు

చేగుంట: మండలంలోని చందాయిపేటలో ఈ నెల 15 నుంచి 17 వరకు వీర హనుమాన్ ఆలయ వార్షికోత్సవం జరగనుంది. కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ గ్రామస్థులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కలిశారు. శుక్రవారం గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు పబ్బ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు శోభన్, ప్రదీప్, ముత్యాలు, నాగరాజు హైదరాబాద్‌కు వెళ్లి ఎంపీకి ఆహ్వానపత్రిక అందజేశారు.

పీఆర్టీయూ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా సంతోషి కుమారి



హవేలిఘనపూర్: జిల్లా పీఆర్టీయూ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా మండల పరిధి మద్దుల్వాయి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న బి.సంతోషి కుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు సుభాష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షురాలిగా పదవి ఇచ్చినందుకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి. సుంకరి కృష్ణ, సామ్య నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి: ఎమ్మెల్యే

శివ్వంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందించి న్యాయం చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం శివ్వంపేట రైతువేదికలో శివ్వంపేట 41, మనోహరబాద్ 16 కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. మూడు నెలల కిందట తయారు చేసిన కల్యాణలక్ష్మి చెక్కులు కాంగ్రెస్ నాయకులు ఆపారన్నారు. చెక్కులపై తనతో సంతకాలు పెట్టిస్తే పంపిణీ ఎవరు చేయాలని లబ్ధిదారులను అడిగారు. అధికారులు నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తామని ఇవ్వలేదన్నారు. నర్సాపూర్‌లో ప్రతి శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటానన్నారు. ఆలస్యంగా వచ్చినందుకు క్షమించాలని ఎమ్మెల్యే కోరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిరీక్షించిన మహిళలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలియడంతో ఎస్సై మహిపాల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది వారికి నచ్చజెప్పారు. ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్ ఉన్నారు.

పొదల మాటున నియంత్రిక



నర్సాపూర్ పట్టణంలోని తూప్రాన్ మార్గంలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి కనిపించకుండా ఉంది. అయినా విద్యుత్తు సిబ్బందికి పట్టడం లేదు. సంగారెడ్డి-నర్సాపూర్-తూప్రాన్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ మార్గంలో నియంత్రిక వద్ద సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు, కనీసం అక్కడి పరిసరాల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నర్సాపూర్

పచ్చందారులు



వెల్దుర్తి, కుకునూర్ మధ్య రోడ్డుకు ఇరువైపులా..

న్యూస్‌టుడే, వెల్దుర్తి, శివ్వంపేట:

అశోక చక్రవర్తి రోడ్ల పక్కన చెట్లు నాటించను.. బాటసారులకు చల్లదనం కలిగించడానికి కృషి చేశారని పాఠ్య పుస్తకాల్లో చదువుకున్నాం. అనంతరం రాజులు, చక్రవర్తులు రహదారుల పక్కన చెట్లు పెంచారు. ఆ చెట్లు మహా వృక్షాలుగా ఎదిగి దారులన్నీ పచ్చదనం సంతరించుకున్నాయి. ప్రస్తుతం రోడ్ల విస్తరణతో పలుచోట్ల మహా వృక్షాలను తొలగించారు. దీంతో దారులన్నీ వెలవెల పోయాయి. మళ్లీ ఇప్పుడు మొక్కలు నాటుతున్నారు. పచ్చదనం సంతరించుకుంటేనే ప్రపంచం చల్లగా ఉంటుందని వాతావరణంలో సమతుల్యత ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికితోడు పచ్చదనం పెంపొందించాలని ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నాయి. రాష్ట్రంలో హరితహారం కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటడం సంరక్షించడం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద, మరోవైపు అటవీ శాఖ ఆధ్వర్యంలో అటవీ ప్రాంతాలు, పొలాల్లో, బీడు భూముల్లో, రోడ్లకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటుతున్నారు. గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి వృక్షాలుగా మారాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా మార్గాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు, వృక్షాలుగా ఎదిగి చల్లదనంతో పాటు ప్రాణవాయువు ఇస్తున్నాయి. కొన్నిచోట్ల రంగురంగుల పూలతో ఆహ్లాదకరం కలిగిస్తున్నాయి.



బోజ్యా తండా రోడ్డులో గుల్‌మోహర్ చెట్లు

వెల్దుర్తి ఉమ్మడి మండలంలో..

వెల్దుర్తి ఉమ్మడి మండలం వ్యాప్తంగా రోడ్ల పక్కన సుమారు 100 కి.మీ పొడవునా రోడ్లపక్కన చెట్లు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో చెట్లు ఏపుగా ఎదిగి రోడ్లపై పందిరేసినట్లు చల్లదనం ఇస్తున్నాయి. నర్సాపూర్-మంగళపర్తి, వెల్దుర్తి మీదుగా తూప్రాన్ వరకు 48 కి.మీ పొడవునా గతంలో అటవీశాఖ వారు నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా పెరిగాయి. ఈ రోడ్డుపై నర్సాపూర్, గజ్వేల్ నియోజకవర్గాల పరిధిలోని వందలాది గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రాలైన మెదక్, సంగారెడ్డి తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. వెల్దుర్తి, పోతంశెట్టిపల్లి, వెల్దుర్తి, మెదక్, ధర్మారం నుంచి కొడిపల్లి, వెల్దుర్తి-శివ్వంపేట, రామాయపల్లి-ఎదులపల్లి, ఉప్పులింగాపూర్-ఎదులపల్లి, ఉప్పులింగాపూర్-గౌవ్వలపల్లి, మెల్లూరు-బొమ్మారం, రామంతాపూర్-లింగారెడ్డిపల్లి వరకు రహదారులకు ఇరువైపులా పచ్చనిచెట్లు ఉన్నాయి. ఉమ్మడి మండలంలో రోడ్ల పక్కన సుమారు 30వేల చెట్లు ఉన్నాయి.

శివ్వంపేటలో పచ్చదనం..

మండలంలో ఎక్కడా చూసిన రోడ్లు పచ్చని తోరణం వేసినట్లు దర్శనమిస్తున్నాయి. పిల్లుట్ల, గోమారం, పోతులబోగూడ, దంతాన్‌పల్లి నుంచి దొంతి వరకు, పెద్దగొట్టిముక్ల, చిన్నగొట్టిముక్ల, ఉసిరికపల్లి, గుండ్లపల్లి, పాంబండ, రత్నాపూర్, తిమ్మాపూర్, కొత్త పేట, గూడూరు, చండి-సికింద్లాపూర్, శభాష్‌పల్లి ఇలా ఏ దారి చూసినా చల్లని నీడనిచ్చే చెట్లు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఇటీవల మండలంలోని ఆయా దారుల్లో ఎండిన, ధ్వంసమైన చెట్ల స్థానంలో మళ్లీ మొక్కలు నాటారు. వీటి రక్షణ కోసం తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్‌టుడే, చేగుంట ? చేగుంటలోని ఎన్‌జీవో కాలనీలో చాలా వీధుల్లో సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మట్టి రోడ్లు కూడా గుంతలమయంగా మారాయి. కాలనీల్లో సీసీ దారుల నిర్మాణం ఎప్పుడు చేస్తారు? – దయాకర్‌రెడ్డి, స్థానికుడు

✔ ప్రస్తుతం పంచాయతీలో ఎలాంటి నిధులు లేవు. రాగానే ప్రాధాన్య క్రమంలో తప్పకుండా కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించి, ఇబ్బందులు తొలగిస్తాం. – నరేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి

కష్టపడి చదివితే కొలువు ఖాయం



రవీందర్‌ను సన్మానిస్తున్న సీఐ మధుసూదన్‌గౌడ్ తదితరులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఇష్టంతో కష్టపడి చదువుకుంటే ఉద్యోగం సాధించడం పెద్ద కష్టం కాదని మెదక్ టౌన్ సీఐ మధుసూదన్‌గౌడ్ అన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన వెల్దుర్తికి చెందిన భీమ్ వారియర్స్ యువజన సంఘం అధ్యక్షుడు ముల్కా రవీందర్‌ను ఆ సంఘం సభ్యులు, గ్రామస్థులు సన్మానించారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ పాల్గొని మాట్లాడారు. సంఘం సభ్యులు, గ్రామస్థులు పాల్గొని అభినందించారు.

యువకుడికి సన్మానం

రామాయంపేట: డీఎస్సీలో ప్రతిభ చూపి ఉద్యోగానికి ఎంపికైన యువకుడిని గ్రామస్థులు సన్మానించారు. రామాయంపేట పరిధి గొల్పర్తికి చెందిన రొయ్యల రాజు ఎస్జీటీ ఉద్యోగం సాధించాడు. పేద కుటుంబానికి చెందిన ఆయన ఉద్యోగం సాధించిడం పట్ల శుక్రవారం గ్రామస్థులు అభినందిస్తూ సన్మానించారు.

తూప్రాన్ టోల్‌గేట్ వద్ద వాహన రద్దీ



తూప్రాన్, న్యూస్‌టుడే: తూప్రాన్ పురపాలిక పరిధి అల్లాపూర్ శివారులో 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద శుక్రవారం వాహనాల రద్దీ నెలకొంది. దసరా పండుగ కావడంతో హైదరాబాద్ జంట నగరాల్లో ఉన్న ఉమ్మడి నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాలకు చెందిన ప్రజలు వాహనాల్లో నిజామాబాద్ వైపు తరలివెళ్లారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు టోల్గేట్ వద్ద వాహనాలు రద్దీ నెలకొంది. ముందు వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో వెనుక పదుల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

యువకులు క్రీడల్లో రాణించాలి

చిలప్‌చెడ్: గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించాలని భారాస సీనియర్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధి గంగారంలో గత రెండు రోజులుగా గ్రామ మాల సంఘం యువకులు జీపీఎల్-2 క్రికెట్ లీగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన పోటీలు శుక్రవారం ముగిశాయి. భారాస నాయకుడు మధుసూదన్‌రెడ్డి విజయం సాధించిన సభ్యులకు ప్రథమ బహుమతి రూ.11,500, ద్వితీయ రూ.5,500 అందజేశారు.

ప్రతిభ చూపితే సమాజంలో గుర్తింపు

రేగోడ్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని వాలీబాల్ పోటీల నిర్వాహకులు పేర్కొన్నారు. ఆర్.ఇటిక్యాల గ్రామానికి చెందిన ఈడిగి అంజయ్య స్మారక వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేత జట్టు సభ్యులకు శుక్రవారం నగదు బహుమతి, జ్ఞాపికలను బహూకరించారు. నాగరాజు, బాలయ్య, శివకుమార్ తదితరులున్నారు.

ఎస్సైపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మార్పీఎస్

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: మహిళా ఏఎస్సైని మానసికంగా ఇబ్బందులకు గురిచేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేలా చేసిన ఎస్సై యాదగిరిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్ర, కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. చిలప్‌చెడ్ ఠాణాలో ఏఎస్సై సుధారాణి ఆత్మహత్య ప్రయత్నం చేసిన విషయమై శుక్రవారం ఠాణా ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.






నార్సింగిలో... అల్లాదుర్గం: మందాపూర్‌లో... పెద్దశంకరంపేటలో.. తూప్రాన్‌లో..


ఊరూరా..అమ్మసేవలో మనసారా



రామాయంపేటలో కుంకుమార్చన



కొడిపల్లిలో బోనాలతో మహిళల ప్రదర్శన



జంగరాయిలో మహాలక్ష్మీదేవి అవతారంలో దుర్గమ్మ

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో మహిళలు భారీగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల్లో ఏర్పాటు అమ్మవారి విగ్రహాలకు సామూహిక కుంకుమార్చనలు చేశారు. చిన్నశంకరంపేట, పెద్దశంకరంపేట, నర్సాపూర్, చేగుంట, నార్సింగిలో మండపాల వద్ద హోమాలు, కౌడిపల్లి, అజ్జమర్రిలో ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి బోనాలను సమర్పించారు. మహిళలు తమ ఇళ్లల్లో బోనాలను తయారు చేసి ప్రధాన వీధుల మీదుగా ప్రదర్శన నిర్వహించారు. రేగోడ్, రామాయంపేట, శివ్వంపేట, టేక్మాల్, అల్లాదుర్గం, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాలు, ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేశారు. – న్యూస్‌టుడే బృందం

21న చలో హైదరాబాద్

నర్సాపూర్: ఎస్సీ వర్గీకరణలో ఏడు శాతం వాటా కోసం ఈ నెల 21న చేపడుతున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హోలియ దాసరి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాఖమూరి యాదగిరి కోరారు. శుక్రవారం నర్సాపూర్‌లో ఆయన మాట్లాడుతూ.. అదేరోజు నిరసన దీక్ష ఉంటుందని, ఎస్సీలోని 57 ఎంబీఎస్‌సీ కులాలకు చెందిన వారు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఎల్ఈఈడీ దీపాల వితరణ

చిన్నశంకరంపేట: మండల పరిధి జంగరాయికి చెందిన చేపూరి లలిత, రమేష్‌లు రూ.30వేల విలువ చేసే ఎల్ఈడీ దీపాలను శుక్రవారం మాజీ సర్పంచి ప్రభాకర్‌కు అందించారు. దీంతో దాతలకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం

శివ్వంపేట: మండలంలోని నవాబ్‌పేటకు చెందిన ఎండీ జబ్బార్, గఫార్ తల్లి మృతి చెందడంతో మాజీ జడ్పీటీసీ సభ్యుడు పబ్బ మహేష్‌గుప్తా శుక్రవారం రూ.10వేలు సాయం అందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

మనోహరాబాద్: మండలంలోని కాళ్లకల్ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి దసరా పండుగ పురస్కరించుకుని మాజీ సర్పంచి కాళీదాస్ దంపతులు శుక్రవారం నూతన దుస్తులు పంపిణీ చేశారు.

ఫ్లెక్సీ చించివేతపై గ్రామస్థుల ఆందోళన

నార్సింగి (చేగుంట): నార్సింగి మండలం వల్లూరులో ఫ్లెక్సీ చించివేతపై గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. గ్రామంలో అంబేడ్కర్ యూత్, శివాజీ యూత్ సభ్యులు దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చించివేశారు. ఫ్లెక్సీని చించిన వారిని గుర్తించి శిక్షించాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలిసిన ఎస్సై అహమ్మద్ మోహినొద్దీన్ గ్రామానికి వెళ్లారు. స్థానికులతో మాట్లాడి చించివేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

సీసీ రోడ్ల నిర్మాణం.. ప్రజల్లో సంతోషం



హవేలిఘనపూర్‌లో..

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల్లో చిన్నపాటి వర్షం కురిసినా మట్టి దారులు చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడే పరిస్థితులు తీరనున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తుండడంతో ఇబ్బందులు తొలగనున్నాయి. వానా కాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే రోడ్లను ఎంపిక చేసి వాటిని సీసీ దారులుగా మారుస్తుండడంతో ఏళ్లనాటి సమస్య తీరుతోందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. హవేలిఘనపూర్ మండలంలో రూ.50లక్షలతో పలు పల్లెల్లో సీసీ రహదారులు వేశారు. మండల కేంద్రం హవేలిఘనపూర్ రూ.10లక్షలు, సర్దన రూ.20లక్షలు, బూర్గుపల్లి రూ.20లక్షల వ్యయంతో రోడ్లు నిర్మిస్తున్నారు. గ్రామాల్లో సీసీ దారుల నిర్మాణంతో ఇక రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

– సల్మాన్, పీఆర్ ఏఈ, హవేలిఘనపూర్

గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు ఉన్న చోట గ్రామ సభల తీర్మానం మేరకు సీసీ దారుల నిర్మాణం చేస్తున్నారు. గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు పాటించాలి. ప్రస్తుతం హవేలిఘనపూర్, బూర్గుపల్లి, సర్దన గ్రామాల్లో సీసీ దారుల నిర్మాణం చేపడుతున్నారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తీరనున్నాయి.

గ్రామ దేవతలకు పూజలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రం వెల్దుర్తిలో శుక్రవారం దుర్గా స్వాములు గ్రామ దేవతలకు విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి ఆయా గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లి ఒడి బియ్యం, వస్త్రాలు సమర్పించారు. రేణుక ఎల్లమ్మ, కట్ట పోచమ్మ, దుర్గమ్మ, రాజరాజేశ్వరిదేవి ఆలయాల్లో స్వాములు పూజలు నిర్వహించారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న దుర్గా స్వాములు

లక్ష్యానికి మించి సభ్యత్వ నమోదు: భాజపా



నర్సాపూర్‌లో సభ్యత్వ సేకరణలో నాయకులు

నర్సాపూర్: భాజపా సభ్యత్వ సేకరణను లక్ష్యానికి మించి చేపడుతామని ఆ పార్టీ అనుబంధ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలో సంత రోజున వ్యాపారుల నుంచి సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో గిన్నిస్ రికార్డు సృష్టించామని, ప్రస్తుతం అంతకు మించి సభ్యత్వం చేయిస్తామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తదితరులున్నారు.

బగలాముఖి శక్తిపీఠంలో సహస్ర పుష్పార్చన



పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, మహేష్ గుప్తా

శివ్వంపేట: శ్రీ బగలాముఖి క్షేత్రంలో శుక్రవారం మహా మంత్ర హవనం, సహస్ర పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. శక్తిపీఠం వ్యవస్థాపకులు వెంకటేశ్వర శర్మ, ఆలయ స్థలదాత, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా ఆధ్వర్యంలో పల్లకీసేవ, విశేష పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి అమ్మవారి పల్లకీ మోసి, పూజలు చేశారు. స్వరూప-రమేష్ గుప్తా దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కాళికామాత ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండల పరిధి మన్నెవారిజలాల్‌పూర్‌లో కొలువైన కాళికామాత దయతో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. శుక్రవారం కాళికామాత ఆలయాన్ని సందర్శించి విశేష పూజలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ చంద్రాగౌడ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రమేష్ గౌడ్, భారాస జిల్లా నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, భూపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, యాదాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

నర్సాపూర్, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. నర్సాపూర్‌లోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి 81మంది లబ్ధిదారులకు శుక్రవారం చెక్కులు పంపిణీ చేశారు. పురపాలిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నయీమొద్దీన్, ఆర్ఐ ఫైజల్ మహ్మద్ తదితరులున్నారు.

పెళ్లయిన వ్యక్తితో వివాహం చేశారని.. వివాహిత ఆత్మహత్య



రాణి

రేగోడ్, న్యూస్‌టుడే: తనకు తెలపకుండా వివాహమైన వ్యక్తితో పెళ్లి చేశారని మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దోసపల్లి గ్రామానికి చెందిన పుత్ర సీమాన్‌తో సుమారు ఐదు నెలల క్రితం నాగల్‌గిద్ద మండలం గొందెగామ్ గ్రామానికి చెందిన రాణి(31) వివాహం జరిగింది. సీమాన్ మొదటి భార్య విడాకులు ఇవ్వడంతో మరో వివాహం చేశారు. ఈ విషయం తెలియకుండా ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు రాణితో వివాహం చేశారు. అనంతరం రాణికి విషయం తెలియడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. మనస్తాపంతో గురువారం సాయంత్రం దోసపల్లి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో రాణి తల్లిదండ్రులకు తెలియజేశారు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం దోసపల్లికి చేరుకుని గ్రామ శివారులో వెతుకగా.. వ్యవసాయ బావి వద్ద చెప్పులు ఇతర వస్తువులు కనిపించడంతో బావిలో గాలింపు చేపట్టగా రాణి మృతదేహం లభ్యమైంది. మృతురాలి తల్లి మీనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవానహనదారుడి దుర్మరణం



శేఖర్

కౌడిపల్లి, న్యూస్‌టుడే: సైకిల్‌ని ఢీకొని ద్విచక్ర వాహనంపైన వెళ్తున్న యువకుడు దుర్మరణం చెందిన విషాద ఘటన కౌడిపల్లి శివారు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లికి చెందిన ఇటబోయిన విఠల్ నాగమణి దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా చిన్న కుమారుడు శేఖర్ (22) పండ్ల వ్యాపారం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నారు. శుక్రవారం ద్విచక్ర వాహనంపై ధర్మాసాగర్ వైపు వెళుతుండగా మినీ ట్యాంకుబండ్ సమీపంలో జాతీయ రహదారిపైన ముందు వెళుతున్న సైకిల్‌ను ఢీకొని రోడ్డుపై పడి గాయపడ్డారు. వెంటనే కుటుంబీకులు కారులో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. సైకిల్ పైన ఉన్న ధర్మాసాగర్ గ్రామానికి చెందిన శర్ఫోద్దీన్ సైతం గాయపడ్డారు. ఘటన స్థలాన్ని ఎస్సై రంజిత్‌రెడ్డి సందర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.